క్లుప్తంగా

సర్వేతో దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు



అంబడిపూడిలో వైకల్య చిన్నారికి అడ్మిషన్ ఇస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు

బల్లికుర: గ్రామాల వారీగా నుంచి 18 సంవత్సరాల్లోపు దివ్యాంగ విద్యార్థులను సర్వేతో గుర్తిస్తున్నట్లు సమగ్రశిక్ష ప్రత్యేక ఉపాధ్యాయుడు పి. నాగబాబు, జి. నాగిని తెలిపారు. ఆదివారం అంబడిపూడిలో సర్వే చేపట్టారు. సర్వేతో 21 రకాల దివ్యాంగులను గుర్తించి బల్లికురవలోని భవిత కేంద్రంలో చేర్పిస్తున్నట్లు చెప్పారు. ఆటపాటలతో ఒత్తిడిలేని విద్యను అందించేందుకు జూన్9 వరకు సర్వే కొనసాగిస్తామని వైకల్యం చిన్నారులను భవిత కేంద్రంలో చేర్పించేందుకు ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు.

108 వాహనంలో ప్రసవం



108లో ప్రసవం చేసిన ఈఎంటీ అశోక్

బల్లికురవ: పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణికి 108 సిబ్బంది సుఖప్రసవం చేసి తల్లీ బిడ్డను కాపాడారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున బల్లికురవ మండలంలోని కూకట్లపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పి. ఎస్తేరు రాణి పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108కి ఫోన్‌చేశారు. బల్లికురవ నుంచి గ్రామానికి వచ్చి 108 సిబ్బంది నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తీసుకువెళుతున్నారు. మార్గమధ్యంలో సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు వద్దకు వచ్చేసరికి పురిటి నొప్పులు అధికం కావడంతో వాహనాన్ని పైలెట్.. రోడ్డు మార్జిన్‌లో ఆపాడు. ఈఎంటీ జి. అశోక్, పైలెట్ బాషా సుఖప్రసవం చేశారు. సకాలంలో గ్రామానికి వచ్చి కాన్పు చేయటంతో ఎస్తేరురాణి కుటుంబ సభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరోగ్యానికి సంజీవని ఆయుర్వేదం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ తేజేష్

చీరాల: దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేసే ఆయుర్వేదం ఆరోగ్యానికి సంజీవని వంటిదని ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ సీహెచ్ సింధు, డాక్టర్ డి.తేజేష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శతాయుష్ ఇంటర్నేషనల్ ఆయుర్వేద హాస్పిటల్ వైద్యబృందం ఉచిత మెగా ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, భారత వైద్యమండలి అధికారకంగా గుర్తించిన ఆయుర్వేదాన్ని సమాజం సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. అధ్యక్ష, కార్యదర్శులు గాదె హరిహరరావు, ఎ.రామారావు, గౌరవాధ్యక్షులు కట్టా వినయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు వీఎస్ఆర్ శర్మ, వి.వెంకటేశ్వరరావు, ఎన్‌జీవీ శర్మ, కె.ఆంజనేయులు, రవీంద్రనాథ్, శివాంజనేయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు




క్షతగాత్రుడు మస్తాన్‌వలి

అద్దంకి: రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని ద్వారకానగర్‌వద్ద ఆదివారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన ఎస్‌కే మస్తాన్ వలి తన బైక్‌పై టౌన్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ద్వారకానగర్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీ కొట్టుకోవడంతో మస్తాన్ వలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉండడంతో 08 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ధాన్యం.. కలవరం

- ఇళ్లు, కల్లాల్లో ధాన్యం నిల్వలు
- ప్రకటనలే పరిమితమైన కొనుగోలు కేంద్రాలు
- ఇ- పంటలో నమోదు చేసుకున్నా కొనుగోళ్లు నిల్



గుంటుపల్లిలో ఇళ్ల నుంచి కదలని ధాన్యం బస్తాలు



పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం

బల్లికురవ: రైతు పండించిన పంటలను గిట్టుబాటు ధర లభించక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు చేసి ఆదుకుంటామని ప్రభుత్వం చేసే ప్రకటనలు ఆచరణలో కార్యరూపం దాల్చటం లేదు. ఆహార ధాన్యమైన వరి పంట పండించి రెండు నెలలౌతున్నా ఇళ్లలో నుంచి, కల్లాల్లో నుంచి కదలటం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని గుంటుపల్లి, చిన అంబడిపూడి, పెద అంబడిపూడి, కొత్తరెడ్డిపాలెం, ముక్తేశ్వరం, సూరేపల్లి గ్రామాల్లో రబీలో గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో సన్నాల రకాన్ని సాగు చేశారు. చౌడు భూములు కావటంతో వాతావరణ పరిస్థితులు.. చీడపీడల బారి నుంచి తట్టుకొని అధిక దిగుబడులను ఇస్తాయని అధికారులు సూచించటంతో అధిక విస్తీర్ణంలో సాగు చేశారు.

ఎవరు పట్టించుకుంటారు?

బల్లికురవ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కింద అంబడిపూడి, ముక్తేశ్వరం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 75 కేజీల బస్తా రూ. 1740కు కొనుగోలు చేస్తామని.. తేమ శాతం తక్కువగా ఉండాలని అధికారులు సూచించారు. రైతులు ఇ- పంటలో నమోదుతో రైతు సేవా కేంద్రాల్లో చేతికందిన పంట అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెళ్లారు. అయితే నెల్లూరు సన్నాలు కొనుగోలుకు అనుమతులు లేవని అధికార్లు చెప్పటంతో పండించిన పంట ఎలా అమ్ముకోవాలో రైతులకు అంతు చిక్కటం లేదు. కొనుగోళ్లు చేపట్టనందున ప్రయివేట్ వ్యాపారులు ఇదే అదునుగా భావించి 75 కేజీల బస్తా రూ.200 నుంచి రూ. 1300కే కొనుగోలు చేపట్టారు. ఇలా కాటాల్లో మోసంతో బస్తాకు అదనంగా 10 కేజీలు మోసం చేస్తున్నారు. ముక్తేశ్వరంలో ఈ విషయాన్ని గుర్తించటంతో సదరు వ్యాపారి అదనంగా తీసుకున్న 10 కేజీలకు సొమ్ము వెలకట్టి ఇచ్చి పలాయనం చిత్తగించాడు. ఇదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేపడితే మోసాలకు అవకాశం ఉండదని రైతులంటున్నారు. ఈ విషయాలపై వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారిని వివరణ కోరగా నెల్లూరు సన్నాలు కొనుగోలుకు ప్రభుత్వ అనుమతులు లేవన్నారు. సాగుచేసిన రైతులు ఇప్పటికే కొందరు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకున్నారు. ధాన్యం నిల్వలున్న రైతులు వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదిస్తే, కొనుగోళ్ల అనుమతులకు కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

ఇ- పంటలో నమోదు చేసినా కొనుగోళ్లు లేవు:



రైతు పండించే పంటలను ఇ- పంటలోనే నమోదు చేసుకోవాలని.. ఉత్పత్తులను రిజిస్ట్రేషన్‌తో అమ్ముకోవచ్చని ప్రకటించారు. దీంతో నెల్లూరు సన్నాలు సాగుతో చేసి నమోదు చేశాం. అయినా.. వరి పంటను ఎందుకు కొనుగోలు చెయ్యడం లేదో అంతు చిక్కటంలేదు.

– పెద్ది ఏడుకొండలు

పెట్టుబడులు ఎలా తీర్చాలి



ఎకరా వరి పంట సాగుకు రూ. 50 వేల వరకు పెట్టుబడులయ్యాయి. ధాన్యం నూర్పిడి చేసి రెండు నెలలౌతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి రిజిస్ట్రేషన్‌కు వెళ్తుంటే ఎల్లూరు సన్నాలు కొనమని చెప్తున్నారు. పెట్టుబడులు ఎలాతీర్చాలి. పండించిన ధాన్యాన్ని ఎం చేసుకోవాలి?

– ఇ. సుధాకర్

ప్రభుత్వమే ఆదుకోవాలి



వరిపంట కొనుగోళ్లు చేసి ప్రభుత్వమే ఆదుకోవాలి. పంటసాగుకు ఈ ఏడాది పెట్టుబడులు అధికమయ్యాయి. ధాన్యం నిల్వలు ఇళ్లల్లో నుంచి కదలనందున పెట్టుబడులు ఎలా తీర్చాలో అంతుచిక్కడం లేదు.

– పెద్ది వెంకటేశ్వర్లు

నేడు డయల్ యువర్ డీఎం

అద్దంకి రూరల్: అద్దంకి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అద్దంకి డిపో మేనేజర్ బి. రామ్మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 9959225697 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని విచారణ వివరాలు, నీటి తీరువా వసూళ్లు, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నిర్వహిస్తున్న సమావేశానికి రెవెన్యూ సిబ్బంది విధిగా హాజరుకావాలని తహసీల్దార్ గోపీకృష్ణ సూచించారు.

మూడు రంగులు మురిసెను



చీరాల పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అద్దంకి: తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చీరాల: ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైనిక దళాలకు సంఘీభావంగా ఆదివారం రాత్రి చీరాల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పేరాల్లోని గోలి సదాశివరావు కళ్యాణ మండపం నుంచి ప్రారంభమైన ర్యాలీ గడియార స్తంభం, మార్కెట్ సెంటర్, గరల్స్ హైస్కూల్, ఎంజీసీ మార్కెట్, బస్టాండ్, నాజ్ థియేటర్ రోడ్డు మీదుగా గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుంది. ర్యాలీలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, కూటమి నేతలు, ప్రజలు, ప్రజా సంఘాల నేతలు, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెహెల్గామ్‌లో ఉగ్రవాదులు మతం పేరు అడిగి భార్యాబిడ్డల ఎదుటనే హిందువులును దారుణంగా కాల్చి చంపారన్నారు. కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ కూడా ఉగ్ర తూటాలకు బలయ్యారని తెలిపారు. పాక్ ఉగ్రవాదుల దుశ్చర్యలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ సత్తా చాటిందన్నారు. మన సైనికుడు మురళీనాయక్ పాకిస్థాన్ సైన్యంతో పోరాడుతూ అమరుడయ్యారన్నారు. త్రివిధ దళాలకు దేశమంతా అండగా ఉందని, ఆపరేషన్ సింధూర్‌తో దేశం తన సత్తాను ప్రపంచానికి చాటిందన్నారు. దేశమంతా ఐకమత్యంగా ఉందని, కులమతాలకు అతీతంగా ఒకే తాటిపై నడుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధికంగా పాల్గొన్నారు.

అద్దంకి: ఆపరేషన్ సింధూర్ ద్వారా మన సైనికులు ఉగ్రవాదానికి సరైన జవాబు చెప్పారని మునిసిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. ఆదివారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు బొమ్మ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. నందమూరి కళా పరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. తిరంగా ర్యాలీ ఉద్దేశించి మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగాన్ని, ప్రజలను అవమాన పరచిన వారికి సరైన గుణపాఠం ఇప్పుడే కాదు, భవిష్యత్తులో భారతదేశం జవాబు ఇస్తుందన్నారు. అమర జవాన్‌కు నివాళి అర్పించారు.

తిరుమలకు కూరగాయల తరలింపు

- ప్రత్యేక పూజలు, మహిళల కోలాటంతో గ్రామంలో ప్రదర్శన



కూరగాయల వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు, స్థానికులు

మార్టూరు: తిరుమల, తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి నిత్యాన్నదాన ప్రసాదం కోసం మార్టూరు నుంచి కూరగాయల వాహనం ఆదివారం ఉదయం తిరుమలకు బయలుదేరి వెళ్లింది. 80 వేల మంది భక్తుల అన్నదానంలో అవసరమైన కూరగాయలతో కూడిన వాహనానికి స్థానిక గన్నవరం రోడ్డులోని వినాయక ఆలయం వద్ద పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళల కోలాట ప్రదర్శనలతో భక్తులు వెంట రాగా జాతీయ రహదారిపై స్టేట్ బ్యాంక్ వరకు ప్రదర్శన నిర్వహించి కూరగాయల వాహనాన్ని తిరుమలకు సాగనంపారు.



కూరగాయల వాహనం ముందు కోలాటం ప్రదర్శిస్తున్న స్థానిక మహిళలు

ఆదివారం ఆటవిడుపు

- వసతులు లేక ఇబ్బందులు పడిన పర్యాటకులు

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్రతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో చీరాల, పర్చూరు, గుంటూరు, చిలకలూరిపేట ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో పాటు, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడిపారు. సముద్రపు అలలతో కేరింతలు కొడుతూ స్నానాలు చేస్తూ సముద్రపు మన్నుతో ఆటలాడుకుంటూ సరదాగా గడిపారు. తీరంలో ఆదివారం సండే సందడి నెలకొంది.

పోలీసు భద్రత

మండలంలోని పర్యాటక ప్రాంతాలైన వాడరేవు, రామాపురం, తదితర సముద్ర తీర ప్రాంతాలు పోలీసుల భద్రత మధ్య పహారాలో ఉన్నాయి. నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు వారాంతపు సెలవు రోజులు, పర్యాటకులు అధికంగా వచ్చే రోజుల్లో డ్రోన్‌లతో భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, పోలీసులు బందోబస్తు, గజ ఈతగాళ్లతో పహారా కాస్తున్నారు. ఆదివారం వాడరేవుకు అధికసంఖ్యలో పర్యాటకులు వస్తారని అధికారులు, పంచాయితీ సిబ్బందికి తెలిసినప్పటికీ కనీసం తీరం ఒడ్డున మహిళలు దుస్తులు మార్చుకునే సౌకర్యం, తాగునీరు, నిలువనీడ లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తీరం ఒడ్డున కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై అధికారుల తీరుపై పర్యాటకులు విమర్శలు చేస్తున్నారు. తీరప్రాంతంలో పర్యాటకులకు వసతులు కల్పించి, గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకే టోల్‌గేట్ ఏర్పాటు చేసి కార్లకు, ఇతర వాహనాలకు టోల్ పన్ను వసూలు చేస్తున్నామని బాహాటంగా చెబుతున్నా.. కూటమి నేతలు ఎందుకు వసతులు కల్పించడం లేదో చెప్పాలని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.



తీరం ఒడ్డున సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు



డ్రోన్ కెమెరాతో పర్యాటకుల రక్షణ చర్యలు తీసుకుంటున్న రూరల్ ఎస్సై చంద్రశేఖర్



సముద్రంలో కేరింతలు కొడుతూ స్నానాలు చేస్తున్న పర్యాటకులు

గ్రంథాలయాల చేయూత అభినందనీయం

చీరాల అర్బన్: గ్రంథాలయాలకు చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా దాతలను సంప్రదిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం వ్యాపారవేత్త గుంటూరు బాబూ వరప్రసాద్ గ్రంథాలయానికి నాలుగు కుర్చీలు అందచేస్తున్నట్లు తెలిపారన్నారు. చీరాల్లో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, పుస్తక ప్రేమికులు గ్రంథాలయాలకు ఫర్నిచర్ రూపంలో సహకారాన్ని అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. అలానే ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 21న చీరాల్లోని శాఖ గ్రంథాలయంలో జీవవైవిధ్య పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను గ్రంథాలయాలకు పంపి తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సృజనాత్మకతను వెలికితీయడానికే సమ్మర్ క్యాంపులు

సంతనూతలపాడు: ప్రకాశం బాలోత్సవం సంతనూతలపాడు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సుందరయ్య భవన్లో ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు 10 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా క్యాంపులో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. క్యాంపు కన్వీనర్ ఎస్.మాలతి మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం, వికాసం అనే పేరుతో పిల్లలు సృజనాత్మకత కలిగి ఉండాలనే లక్ష్యంతో గత 3 సంవత్సరాలుగా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది నిర్వహించిన సమ్మర్ క్యాంపులో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పిల్లల కోసం పెద్దలు ముందుకు రావాలనే ఉద్దేశంతో వివిధ అంశాల్లో ప్రత్యేకత కలిగిన వారు స్వచ్ఛందంగా క్యాంపులో పాల్గొని విద్యార్థులకు కొత్త విషయాలు నేర్పించారని తెలిపారు. 10 రోజుల పాటు మాలతి కె.కోటేశ్వరరావు, బుజ్జి ఈ కేంద్రాన్ని నిర్వహించారు. విద్యార్థులకు బొమ్మలు గీయడాన్ని రాధ నేర్పించారు. ప్రతి విద్యార్థి బొమ్మలు గీయడానికి ప్రయత్నించారు. క్రాఫ్టింగ్‌పై ఐద్వా రమాదేవి, వీరాస్వామి శిక్షణ ఇచ్చారు. న్యూస్ పేపర్, కలర్ పేపర్ ఉపయోగించి వివిధ రకాల బొమ్మలు తయారు చేయడం, పేపర్ కటింగ్ ద్వారా పలు ఆకారాలు చేయడం వంటి క్రాఫ్టింగ్ నేర్పించారు. శాస్త్రీయ ఆలోచన గురించి కోటేశ్వరరావు వివరించారు. సైన్స్ ప్రయోగాలను బాలోత్సవం కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం నేర్పారు. కొంతమంది మాయలు, మంత్రాల పేరుతో అమాయకులను ఎలా మోసం చేస్తున్నారు, వాటిని ఎలా గుర్తించాలో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులచే కొన్ని ప్రయోగాలు చేయించారు. మ్యాజిక్ క్లాసులో మ్యాజిక్ రామస్ ప్రతి విద్యార్థికి ఒక అంశం నేర్పారు. ఎస్‌వీ నరసింహం, అబ్దుల్ మాలిక్, నెరుసుల వెంకటేశ్వర్లు క్యాంపులో పాల్గొని విద్యార్థులకు నీతి కథలు, పాటలు, ప్రకృతి వ్యవసాయం, కుటుంబ సంబంధాలు, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. దాతల సహకారంతో ప్రతిరోజూ విద్యార్థులకు స్నాక్స్, మ్యాజిక్ పరికరాలు, ఇతర మెటీరియల్, భోజనం అందించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్, కోటేశ్వరరావు, వి.సంపత్, మాలతి పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేసి మానవ విలువలు, లౌకిక విలువలు, శాస్త్రీయ దృక్పథం, క్రమశిక్షణ, దేశభక్తి, ఆడపిల్లల పట్ల సమానత్వం, గౌరవం ఉండాలని, ఇంటి పనుల్లో తల్లిదండ్రులకు పిల్లలు సహకారం అందించాలని సూచించారు.

రహదారులు నీటిమయం

చీరాల టౌన్:

మండలంలో శనివారం కురిసిన భారీ అకాల వర్షానికి గ్రామాల్లోని అంతర్గత రోడ్లుతో పాటు ప్రధాన రహదారులు సైతం వర్షపు నీటితో నిండాయి. ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామాల్లో శనివారం అకస్మాత్తుగా వర్షం కురవడంతో చీరాల-ఒంగోలు, చీరాల-గుంటూరు ప్రధాన రహదారుల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులకు పడ్డారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రధాన రహదారుల్లో వర్షాలు పడిన సమయంలో నీరు నిల్వ చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువులా మారిన ఈపురుపాలెం- బాపట్ల ప్రధాన రహదారి